క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ మారేది లేదు

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ మారే ప్రసక్తే లేదని టీపీసీసీ నేత దైద రవీందర్ చెప్పారు. నకిరేకల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలనే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగు కాకుండా జెండా మోస్తున్నాని తెలిపారు. అధిష్ఠానం టికెట్ కేటాయించక పోయిన పార్టీ మారనని, ప్రజల మధ్య ఉంటూ కోమటిరెడ్డి బ్రదర్స్ నాయకత్వాన పనిచేస్తానని తెలిపారు. సమావేశంలో నాయకులు కొండ శంకర్‌గౌడ్, గార్లపాటి రవీందర్‌రెడ్డి, యూసుఫ్, నక్షత్, రియాజ్ పాల్గొన్నారు.

బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలి

నల్లగొండ టూటౌన్ : వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలోని ఆనంద్‌నగర్, మాన్యంచల్క, హైదర్‌ఖాన్‌గూడ తదితర కాలనీల్లో గడప, గడపకు బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలు తీరుస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కంకణాల నాగిరెడ్డి, ఏరుకొండ హరి, కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

రామగిరి (నల్లగొండ) : పట్టణ పరిధిలోని ఓక్ ట్రీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల చైర్మన్ గింజల నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం ఆయన పాఠశాలలో అభినందించారు. 17 మంది ఒలింపియాడ్‌లో తరువాత స్థాయికి ఎంపికవడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గడ్డం మంగారెడ్డి, హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

డెన్మార్క్ రాయబారిని సత్కరించిన చొక్కారావు



డెన్మార్క్ రాయబారితో చొక్కారావు

నల్లగొండ టూటౌన్: అఖిలభారత అంధుల సమాఖ్య (ఏబీసీబీ) జాతీయ స్థాయి సమావేశాల సందర్భంగా శనివారం ఢిల్లీలో డెన్మార్క్ రాయబారి ఫ్రెడ్డి స్వేన్‌ను సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు ఘనంగా సత్కరించారు. అంధుల అభ్యున్నతి, విద్యాభివృద్ధి తదితర విషయాలు ఆయనతో చర్చించారు. ఏబీసీబీ సంస్థకు అన్ని విధాలుగా సాయం చేస్తామని రాయబారి తెలిపినట్లు చొక్కారావు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

నకిరేకల్ : సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని వివిధ వార్డులకు చెందిన 100 మంది యువకులు శనివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు యల్లపు రెడ్డి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారుల సంక్షేమానికి పాటుపడాలి

నల్లగొండటౌన్ : అన్ని రాజకీయ పార్టీలు చేతి వృత్తిదారుల సంక్షేమానికి పాటుపడాలని వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బండ శ్రీశైలం, జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండలో జరిగిన చేతివృత్తిదారుల సమావేశంలో వారు మాట్లాడారు. వృత్తి దారులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి వాటికి పాలకమండలిని నియమించాలని కోరారు. సమావేశంలో వృత్తి సంఘాల నాయకులు అవిశెట్టి శంకరయ్య, కందగట్ల గణేష్, వెంకన్న, శ్రీనివాస్, పెద్దులు, మల్లేశం, ఐలయ్య, శ్రీరంగం పాల్గొన్నారు.

భూపాల్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలి

నల్లగొండ టూటౌన్: వచ్చే ఎన్నికల్లో భూపాల్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి కంచర్ల రమాదేవి కోరారు. శనివారం నల్లగొండ పట్టణంలోని 33వ వార్డులో భర్త భూపాల్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన మహిళలకు నెలకు రూ. 3వేల సాయం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, మాలె శరణ్యారెడ్డి, మందడి లిఖిత సైదిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

నకిరేకల్ : నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశంను గెలిపించాలని కోరుతూ మున్సిపాలిటీ పరిధిలోని 4,13వ వార్డుల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల సుకన్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, బండపల్లి శ్రీనివాస్, గోకికార్ పరమేష్, రాములు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటెప్పుడు?

- మొదలైన వరికోతలు
- స్పందించని అధికార యంత్రాంగం
- ధాన్యం దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్న రైతులు



మర్రిగూడలో వరి చేనును కోస్తున్న మిషన్

మర్రిగూడ: ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు ప్రభుత్వం కల్పించే మద్దతు ధర కరువైందని రైతులు వాపోతున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. మర్రిగూడ మండలంలో వానాకాలం సీజన్‌లో 5,063 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. గత యాసంగిలో 5,113 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో చేతికొచ్చిన పంటను మాల్, చింతపల్లి, చండూరు ఇతర మండలాలకు రైతులు తరలించాల్సి వస్తుంది. దళారులకు ఇక్కడే విక్రయిస్తే రవాణా చార్జీలు కూడా రైతులపైనే పడుతుంది.

క్వింటా ధాన్యం రూ.1600లకే కొనుగోలు

ప్రస్తుత సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా సమీప గ్రామాల్లో సహకార సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన చోట కనీస మద్దతు ధర క్వింటాకు ఎ -గ్రేడ్‌కు రూ.2200 చెల్లించేవారు. ఇక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు క్వింటాకు రూ.1500 నుంచి రూ.1600 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

గతంలో మర్రిగూడ, శివన్నగూడలో..

మర్రిగూడ మండలంలోని శివన్నగూడ ఎఫ్‌పీసీఎస్(రైతు సేవా సహకార సంఘం)తోపాటు కుదాభక్షపల్లి, నామాపురం గ్రామాల్లో సబ్ సెంటర్లను, మర్రిగూడ పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) తోపాటు యరగండ్లపల్లి సబ్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శివన్నగూడ సంఘం ద్వారా 25వేల క్వింటాళ్లు, మర్రిగూడ సంఘం ఆధ్వర్యంలో 31.46టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మర్రిగూడలో గతంలో జరిగిన అవకతవకల కారణంగా కొనుగోలు కేంద్రం రద్దయినట్లు తెలుస్తుంది.

మర్రిగూడ సంఘంలో ఏం జరిగిందంటే....

మర్రిగూడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో క్వింటాకు 10కిలోలకు పైగా తరుగు విధించి రైతులను మోసం చేశారని ఆరోపణలు ఉన్నాయి. సంఘంలో పనిచేస్తున్న పలువురు పాత ట్రక్‌షీట్లు, కొత్త ట్రక్‌షీట్లలో ధాన్యం బస్తాల సంఖ్యను వేర్వేరుగా నమోదు చేయడంతో 1.95టన్నుల ధాన్యం పూర్తిగా తరుగుకు గురైందని, తద్వారా రూ.40.35లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా సహకార సంఘం అధికారులు వచ్చి సంబంధిత రికార్డులను స్వాధీనపరుచుకున్నారు.

క్వింటాకు రూ.1800 ఇచ్చారు



మర్రిగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో మాల్ వరకు తీసుకెళ్లి ప్రైవేట్ వ్యాపారికి విక్రయించా. క్వింటాకు రూ.1800 మాత్రమే ఇచ్చారు. కొనుగోలు కేంద్రం ఉంటే క్వింటాకు మరో రూ.400 వచ్చేవి. కష్టానికి సరిపడా ఫలితం లభించలేదు. మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలి.

– సిలివేరు అంజయ్య, రైతు, మర్రిగూడ

రూ.40లక్షల వరకు గోల్‌మాల్ చేశారు



గతంలో మర్రిగూడ పీఏసీఎస్ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నా ఒక్కరికి సంబంధించి రూ.17వేల వరకు అధిక కోతల పేరుతో నష్టం చేశారు. అందరి రైతుల నుంచి దాదాపు రూ.40లక్షల మేరకు గోల్‌మాల్ చేశారు. జిల్లా అధికారులు రికార్డులు తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

– గుగంటి వెంకటయ్య, రైతు, మర్రిగూడ

ఐకేపీ సెంటర్‌కు అప్పగించాం

శివన్నగూడలో కొనుగోలు కేంద్రం త్వరలో ప్రారంభం కానుంది. మర్రిగూడకు సంబంధించి కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ సెంటర్‌కు అప్పగించాం. ఇక్కడ గతంలో అధిక తరుగు తీశారని ఉన్న సమాచారం మేరకు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం లేదు. జరిగిన అవకతకవలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి రైతులకు న్యాయం చేస్తాం.

– కిరణ్‌కుమార్, డీసీఓ

ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్‌లో చేరిక

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, నల్లగొండ టూటౌన్: ప్రజా సంక్షేమం కోసమే బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని 21వ వార్డు కౌన్సిలర్ ఫరహత్ ఫర్హానా ఇబ్రహీం, నల్లగొండ మండలంలోని కంచనపల్లి ఎంపీటీసీ సహదేవ్, దోమలపల్లి ఎంపీటీసీ దేశగాని నరసింహ శనివారం హైదరాబాద్‌లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ బెదిరింపులతో బీఆర్‌ఎస్‌లో చేర్చుకొని గ్రామాల అభివృద్ధి పట్టించుకోలేదని, భూపాల్‌రెడ్డిని నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, ఎవరు అధైర్య పడవద్దన్నారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రాబోతుందని, ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి లేక దినసరి కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోవాలని కోరారు. కార్యక్రమంలో నల్లగొండ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ సర్పంచ్ ఉప్పునూతల వెంకన్న యాదవ్, మాజీ సర్పంచ్ పనస శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం



పాతబస్తీలో ప్రచారం చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : బీజేపీ గెలుపుతోనే నల్ల గొండ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ సంతోషిమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. బీజేపీకి ఓటేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చింత ముత్యాల్‌రావు, దాసోజు యాదగిరి, మునగాల సుధ, రమేష్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, భవాని ప్రసాద్, పగిడి మహేష్, ఐతరాజు సిద్ధు, కిషన్, ప్రసాద్, ఈశ్వర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మునుగోడు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు : బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కోరారు. శనివారం చండూరు మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వరాష్ట్రం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్త ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపునకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ, పార్టీ పట్టణ అధ్యక్షుడు భూతరాజు దశరథ, కౌన్సిలర్లు అన్నెపర్తి శేఖర్, కొండ్రెడ్డి యాదయ్య, మోదుగాల వెంకన్న, ముజాయుద్దీన్, కైరు బేగం వహీద్, నకిరేకంటి లింగన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక

కస్తాల గ్రామం నుంచి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న ఆధ్వర్యంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మెండు ద్రౌపతమ్మ వెంకట్ రెడ్డి, గుండమల్ల శ్రీనివాసులు, ఊరుగుండ్ల వెంకన్న మాజీ ఎంపీటీసీ గుండమల్ల వెంకటేశం, దోటి శ్రీనివాసులు, బొమ్మరబోయిన వెంకటేశం, మెండు బ్రహ్మానంద రెడ్డి, మెరుగు అంజయ్య, జాల వెంకటేశం, ఆకారపు రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి

- జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని జెడ్పీ చైర్మన్, నల్లగొండ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బండ నరేందర్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 48వార్డులకు సంబంధించిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి వార్డులో బూత్ కమిటీలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, మాలె శరణ్యారెడ్డి, బోనగిరి దేవేందర్, ఆలకుంట్ల నాగరత్నంరాజు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి



నకిరేకల్ : మొక్కలు నాటుతున్నఅధికారులు

నకిరేకల్: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఆదాయపు పన్ను శాఖ చెందిన ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్‌ఎస్) అధికారులు మేఘనాథ్ చౌహాన్, అరవిందక్షన్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలను శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవపై విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ప్రతిభచూపిన వారికిబహుమతులు అందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, తహసీల్దార్ ప్రసాద్ నాయక్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

నార్కట్‌పల్లి : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ అతిథి గోయల్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శనివారం బాలుర వసతి గృహంలో పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదాయ పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌నాయక్ , జిల్లా అధికారి రాజ్‌కుమార్, డీపీఆర్‌ఓ విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీడీఓ యాదగిరి తదితరులు ఉన్నారు.

తిప్పర్తి, నార్కట్‌పల్లిలో కేంద్ర బలగాల కవాతు



నార్కట్‌పల్లిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

రామగిరి (నల్లగొండ) : తిప్పర్తి మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలు స్థానిక పోలీసులతో కలిసి శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు స్థానిక ఎస్‌ఐ ఎస్.ధర్మా తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సాయుధ బలగాలు, తిప్పర్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ సైదబాబు కోరారు. శనివారం మండలంలోని నార్కట్‌పల్లి, అమ్మనబోలు, ఎల్లారెడ్డిగూడెం, చెర్వుగట్టు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించి మాట్లాడారు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

సమాజ సేవకు పునరంకితం కావాలి



మాట్లాడుతున్న తాడోజు వాణీశ్రీకాంత్‌రాజ్

శాలిగౌరారం: సమాజ సేవకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆరాధ్య ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజ్ కోరారు. మండలంలోని శాలిలింగోటంలో జరిగిన ఫౌండేషన్ ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరాధ్య ఫౌండేషన్ ప్రజాసేవ చేసే స్వచ్ఛంద సంస్థ మాత్రమేనని తెలిపారు. ఫౌండేషన్ ప్రత్యక్ష, పరోక్ష ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఉండదన్నారు. అనంతరం ఫౌండేషన్ జిల్లాకమిటీని ప్రకటించారు.

జిల్లా అధ్యక్షుడిగా తాడోజు ఆచారి



ఆరాధ్య ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన తాడోజు ఆచారి నియమితులయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా గిరగాని వీరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కెనపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గుండా దుర్గయ్య, పజ్జూరు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసాచారి, పర్వతం వెంకటాచారి, కార్యదర్శి కాపుగంటి శేఖర్, సహాయ కార్యదర్శి తొనుకునూరి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి కడారి అంజయ్య, అధికార ప్రతినిధి గజ్జి రవి, కోశాధికారి మద్దెబోయిన శ్రీనివాసు, సోషల్‌మీడియా ఇంచార్జ్ భూమిరెడ్డి నాగార్జున్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు, మండల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులకు గుణపాఠం చెప్పాలి

- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్లగొండలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: అభివృద్ధి నిరోధకులకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ పట్టణంలోని 29, 30, 31వ వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుడు చెప్పే మాయ మాటలు ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ప్రజల కోసం కాదని, ఆ పార్టీలో సీఎం పదవి కోసం పోటీపడుతున్న ఆరుగురి కోసమని ఎద్దేవా చేశారు. నల్లగొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరో రెండేళ్లలో అన్ని పనులు పూర్తి అవుతాయని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తనను రెండవసారి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మార్కెట్ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, కౌన్సిలర్లు మారగోని నవీన్‌గౌడ్, కొమ్ము నాగలక్ష్మి, నేలపట్ల రమేష్, కొమ్ము శంకర్, మిర్యాల స్వామి, సిరాజ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక

నల్లగొండ పట్టణంలోని 45, 46, 43వ వార్డులకు చెందిన బీజేపీ కార్యకర్తలు, ముఖ్య నాయకులు పల్‌రెడ్డి నరేందర్‌రెడ్డి, సట్టు కిరణ్ నాయకత్వంలో శనివారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, రహీంఖాన్, మల్లికాంబ, రమాదేవి, ప్రదీప్, రాజు, కోటి, చక్రధర్, దీప, శిల్ప, మనీషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్: మండల పరిధిలోని పానుగోడు గ్రామానికి చెందిన జోగు ముత్తమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. ఆమె కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పంపిన రూ.10వేల నగదును స్థానిక ఎంపీటీసీ పులకరం అండాలువెంకటేశం శనివారం అందజేసాడు. అదేవిధంగా గ్రామానికి చెందిన జోగు గౌరమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెకు రూ.10 వేల నగదును అందజేసారు.

నిరుపేదకు ఆర్థికసాయం

నకిరేకల్ : నకిరేకల్ మున్సిపాలిటీ పరిధి 1వ వార్డుకు చెందిన నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన రావిరాల లీలావతి అనారోగ్యంతో బాధపడుతోంది.ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం పట్టణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూ.52,516లను శనివారం రాత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు పొట్టబత్తుల పార్థసారథి, ప్రధాన కార్యదర్శి రాపోలు రవి, ప్రతినిధులు పిల్లల మర్రి సతీష్, ఎలగందుల వెంకన్న, శ్రీనివాస్, శేషగిరి, రవి,యాదగిరి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



లీలావతికి ఆర్థికసాయం అందజేస్తున్న పద్మశాలి ఉద్యోగులు

నమ్ముకున్న కేడర్‌కు న్యాయం చేయాలి

- సముచిత స్థానం కల్పిస్తే పార్టీ గెలుపునకు పనిచేస్తాం
- పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్‌నేత

చౌటుప్పల్ : మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీనే నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి పాల్వాయి స్రవంతి, ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్‌నేత స్పష్టం చేశారు. అనూహ్యంగా రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం టికెట్ కేటాయించడంతో వీరంతా కంగుతిన్నారు. వీరిద్దరు శనివారం రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడలో మునుగోడు నియోజకవర్గంలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశమయ్యారు. వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. అంతా కలిసి అధిష్ఠానం, టికెట్ దక్కించుకున్న రాజగోపాల్‌రెడ్డి ముందు పలు డిమాండ్‌లు ఉంచారు. ఎప్పటి నుంచో పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు వెంటనే పార్టీ, రాజకీయ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని, వచ్చే ఎన్నికల్లో పాత కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. అదే విధంగా టికెట్ ఆశించిన తమకు సైతం న్యాయం చేయాలన్నారు. నియోజకవర్గంలో పెద్ద సభ ఏర్పాటు చేసి వీటిపై ప్రకటన చేయించడం ద్వారా కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని తీర్మానించారు. తమకు అన్ని విధాలా న్యాయం జరిగితే తామంతా కాంగ్రెస్ గెలుపునకు కలిసికట్టుగా పని చేస్తామని ప్రకటించారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో గుమ్మల మోహన్‌రెడ్డి, గడ్డం అనూప్‌రెడ్డి

కనగల్: మండల పరిధిలోని జి.యడవల్లి గ్రామానికి చెందిన శివదుర్గ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ వార్డు సభ్యుడు పర్సనబోయిన వెంకటేశం ఆధ్వర్యంలో 100మంది ఆ పార్టీ కార్యకర్తలు శనివారం నల్లగొండలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కనగల్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో కేవీఆర్ సోషల్ మీడియా మండలాధ్యక్షుడు పోలె విజయ్‌కుమార్, కట్ట కర్ణాకర్, వెంకన్న, జంగమ్మ, కలమ్మ, సత్తమ్మ, పార్వతమ్మ, లింగమ్మ తదితరులున్నారు.

వైభవంగా శ్రీవేణుగోపాల స్వామి కల్యాణం



వట్టిమర్తి ఆలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అక్కెనపల్లి భీష్మాచారి ఆధ్వరంలో గణపతి పూజ, సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి అనంతరం స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి దంపతులు స్వామి వారి కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు, పుస్తె, మెట్టెలను అందజేశారు. అనంతరం భక్తులు వడి బియ్యాలను, పసుపు కుంకుమలు అందజేశారు. ఈ సందర్భంగా దాసోజు వెంకటాచిరి దంపతులు శ్రీవేణుగోపాల స్వామి, రుక్మిణి, సత్యభామలకు వెండి కిరీటాలను అందజేశారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు బెల్లి సైదులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వట్టిమర్తి గ్రామ సర్పంచ్ బుర్రి రవీంధర్‌రెడ్డి, ధర్మకర్తలు గుత్తా శ్రీధర్‌రెడ్డి, లెంకల శ్రీనివాస్‌రెడ్డి, బెల్లి వెంకన్న, దాసోజు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ చేస్తా.. సత్తా చాటుతా

- టీపీసీసీ ప్రధానకార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి
- మునుగోడు టికెట్ దక్కకపోవడంతో శ్రేణులు, అభిమానులతో సమావేశం

చౌటుప్పల్ : సేవ్ మునుగోడు పేరిట బరిలో నిలిచి తన తడాఖా చూపిస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆయనకు మునుగోడు టికెట్ దక్కకపోవడంతో చౌటుప్పల్ మండలం మండల పరిధిలోని దామెర గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కృష్ణారెడ్డి ప్రత్యేకంగా సమావేశమై వారి నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భార్య, తమ్ముడు, కొడుకు అంటూ సీనియర్‌లు టికెట్‌లు తీసుకొని మిగతా నాయకులకు, కార్యకర్తలకు అన్యాయం చేస్తారా అని ప్రశ్నించారు. మొదటి జాబితాలోనే తన పేరు ఉన్నప్పటికీ ఇద్దరు ఎంపీలు కలిసి ఢిల్లీలో పైరవీ చేసి తన పేరును లేకుండా చేశారని కృష్ణారెడ్డి ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక సీట్లు సాధించినప్పటికీ నల్లగొండ జిల్లా సీనియర్లు మాత్రం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రి సీట్లో కూర్చోనివ్వకుండా కుట్రలు చేస్తారని చెప్పారు. ఈ దొంగలను ఓడిస్తేనే కాంగ్రెస్ పార్టీకి శని వదులుతుందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. బీసీలు, దళితుల వద్ద డబ్బులు వసూలు చేసి తన సొంత పబ్బం కోసం కోమటిరెడ్డి బ్రదర్స్ దానధర్మాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నకిరేకల్‌లో దైద రవీందర్, వేదాసు వెంకయ్య, కొండేటి మల్లయ్యను, భువనగిరిలో పంజాల రామాంజనేయులుగౌడ్‌ను రోడ్డున పడేశాడని అన్నారు. తనను సైతం డబ్బులు అడగగా తాను ఇవ్వకపోవడంతో టికెట్ దక్కకుండా కుట్ర చేశాడని మండిపడ్డారు. ఏదేమైనా సేవ్ మునుగోడు పేరిట బరిలో ఉండి తన సత్తా చూపిస్తానన్నారు. వేర్వేరు పార్టీల నుంచి ఆఫర్ ఉందని, ఆయా పార్టీల నుంచి పోటీచేయాలా లేక స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవాలా అనే విషయంలో అందరి అభిప్రాయాల మేరకు నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నర్సింహగౌడ్, చలమల్ల నర్సింహారెడ్డి, నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి, పాలగోని సత్యం, ఏపూరి సతీష్, మద్దం నర్సింహ, కొమ్ము భిక్షం, గూడూరు వెంకట్‌రెడ్డి, కేతరాజు అచ్చయ్య, భీమిడి ప్రదీప్‌జి, మాదగోని శేఖర్, రాజేష్, జక్కిడి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.